సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం ၊ 18 ၊ నవంబర్ ၊ 2024



నిర్మాణాలపై నిర్లక్ష్యం

గుట్ట మండలంలోని ఐదు గ్రామాల్లో చేపట్టిన హెల్త్ సబ్‌సెంటర్ల భవన నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. - 9లో



తవ్వారు.. మరిచారు

మోత్కూరు పెద్ద చెరువు మినీ ట్యాంకు బండ్ మరమ్మతుల్లో భాగంగా చెరువు కట్ట రోడ్డును తవ్వి వదిలేశారు. - 9లో



ఎక్కడ చూసినా రద్దే

వీకెండ్, శుభకార్యాలు ఉండడంతో హైదరాబాద్ – విజయవాడ హైవేపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. - 10లో

న్యూస్‌రీల్

ప్రధానోపాధ్యాయులకు అవార్డులు

రాజాపేట : మండలంలోని రఘునాథపురం, పారుపల్లి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.మాధవరెడ్డికి, ఎం. శశికుమార్‌లు ఉత్తమ టీచర్ ఇన్‌స్పిరేషన్ – 2024 అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఆదివారం శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ చేతులమీదుగా అవార్డులు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేడు బీసీ కమిషన్ రాక

నల్లగొండ : రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ సోమవారం నల్లగొండ జిల్లాకు వస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతుల సామాజిక, విద్యాపరమైన స్థితిగతులను, ఆర్థిక ప్రయోజనాలను, వారి వృత్తులు, వృత్తుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై బీసీ కమిషన్ అధ్యయనం చేయనుందని పేర్కొన్నారు. 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నల్లగొండ కలెక్టరేట్‌లో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు చెందిన బీసీ వర్గాల ప్రజలతో వ్యక్తిగత, నమోదిత, నమోదు కాని అసోసియేషన్ల నుంచి వినతులు, అభిప్రాయాలను స్వీకరించనుందని తెలిపారు. వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న మెటీరియల్, వెరిఫికేషన్, అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లు తెలుగు, ఇంగ్లిష్‌లో బీసీ కమిషన్‌కు అందజేయవచ్చని పేర్కొన్నారు.

డిసెంబర్ 15 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్, నాయకులు

మోటకొండూర్ : చౌటుప్పల్ పట్టణంలో డిసెంబర్ 15,16,17 తేదీల్లో సీపీఎం మూడవ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తెలిపారు. ఆదివారం చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెంలో మహాసభల కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభల్లో జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభల్లో పార్టీ శ్రేణులు, కార్మికులు, రైతులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేషం, జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు, గడ్డం వెంకటేష్, కొల్లూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

భువనగిరి టౌన్ : దివ్యాంగుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న పాఠశాలలు, ఆశ్రమాలు, సంస్థలు నిర్వహించాలంటే దివ్యాంగుల సంక్షేమ చట్టం–2016 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు వికలాంగుల కార్యాలయంలో ఈనెల 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించకుండా సంస్థలను నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టార్గెట్.. స్టేట్ ఫస్ట్!

'పది' ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యంగా..



సిరిపురం జెడ్పీ హెచ్‌ఎస్‌లో ప్రత్యేక తరగతులు



వెల్లంకి ఉన్నత పాఠశాలలో..

- ప్రణాళిక రూపొందించిన విద్యాశాఖ
- ఏబీసీ గ్రూపులుగా విద్యార్థుల విభజన
- సీ విభాగం విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- అభ్యసన దీపికల పంపిణీ
- హెచ్‌ఎంల నిరంతర మానిటరింగ్

మూడేళ్లుగా ఫలితాలు		
సంవత్సరం	ఉత్తీర్ణత శాతం	రాష్ట్ర స్థాయిలో స్థానం
2021 - 22	94.15	13
2022 - 23	80.97	23
2023 - 24	99.94	25

భువనగిరి, రామన్నపేట : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గత రెండేళ్లుగా యాదాద్రి జిల్లా రాష్ట్రస్థాయిలో వెనుకబడుతోంది. ప్రత్యేక తరగతులు నిర్వహించినా, నిపుణులతో తయారు చేయించిన మెటీరియల్ ఇచ్చినా, ఉదయం స్టడీ అవర్స్‌లో అల్పాహారం సైతం అందజేసినా.. ఫలితాలకు వచ్చే సరికి డీలా పడుతోంది. ఇందుకు ఉపాధ్యాయుల కొరత, పర్యవేక్షణకు ఎంఈఓలు లేకపోవడం కారణమన్న విమర్శలున్నాయి. ఈసారి రాష్ట్ర స్థాయిలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు.

కార్యాచరణ ఇదీ..

- సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
- ప్రతి రోజూ వేకువజామున 5గంటలకు విద్యార్థులను ఉపాధ్యాయులు ఫోన్ ద్వారా నిద్రలేపి చదివిస్తున్నారు.
- ప్రతి రోజూ ఒక సబ్జెక్ట్ కేటాయిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. సబ్జెక్ట్ టీచర్ తప్పకుండా ఉండి ప్రత్యేక తరగతిలో బోధన చేస్తున్నారు.
- ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు మానిట రింగ్ చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేస్తున్నారు.
- తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల ప్రగతిని తెలియజేస్తున్నారు. ఇంటి వద్ద పిల్లలు చదువుకోవడానికి ఏవిధమైన చర్యలు తీసుకోవాలో తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్నారు.
- గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి నిపుణులతో తయారు చేయించిన అభ్యాసన దీపికలను విద్యార్థులకు పంపిణీ చేశారు.
- డిసెంబర్ 31వ తేదీ వరకు అన్ని సబ్జెక్టుల సిలబస్‌ను పూర్తిచేయాలి. ప్రతీ యూనిట్ (పాఠం) పూర్తయిన వెంటనే స్లిప్‌టెస్ట్ నిర్వహించాలి.
- జనవరి 2025 నుంచి వార్షిక పరీక్షలు జరిగే వరకు ప్రతి రోజూ పునఃశ్చరణ(రిమీడియల్) తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- ఎస్‌ఏ–1 ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించాలి. ఏ, బీ గ్రూపుల్లోని విద్యార్థులు మంచి గ్రేడు సాధించే విధంగా తీర్చిదిద్దాలి. సీ గ్రూపు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారు మంచి ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలి.



టేకులసోమారం ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

అగ్రస్థానంలో నిలుపుతాం



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇందు కోసం ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులను ఏ,బీ,సీలుగా విభజించాం. సీ విభాగంలోకి వచ్చే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఉపాధ్యాయులు తెల్లవారుజామున విద్యార్థులకు ఫోన్ చేసి చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర స్థాయిలో మెరుగైన ర్యాంకు కోసం పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాం. తరచూ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నాం.

– కె.సత్యనారాయణ, డీఈఓ

నూరుశాతం ఉత్తీర్ణతకు ప్రయత్నం



పదో తరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలుచేస్తున్నాం. ఇప్పటికే ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. చదువులో వెనుబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. గత ఫలితాలకు దీటుగా మెరుగైన జీపీఏ పాయింట్లు సాధించడం కోసం ప్రయత్నిస్తున్నాం.

– టి.సురేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, వెల్లంకి, రామన్నపేట మండలం

కలిసొచ్చే అంశాలు..

నెల రోజుల క్రితం ప్రభుత్వం ప్రతి మండలానికి ఇంచార్జి ఎంఈఓలను నియమించింది. అలాగే డీఎస్సీ–2024 ద్వారా 252 మంది కొత్త ఉపాధ్యాయులు నియామకం అయ్యారు. ప్రతి ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వచ్చారు. దీంతో సబ్జెక్టులు బోధించడానికి టీచర్ల కొరత కొంతమేకు తీరింది.

జిల్లా స్థానం ఇదీ..

2021–22 విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షలకు 9,400 మంది విద్యార్థులు హాజరు కాగా 8,799 మంది ఉత్తీర్ణులయ్యారు. 80 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 13వ స్థానం దక్కింది. 2022–23 విద్యా సంవత్సరంలో 8,973 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 7,265 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా 23వ స్థానంలో నిలిచింది. 2023–24 విద్యా సంవత్సరంలో 9,108 మంది విద్యార్థులకు గాను 8,237 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో జిల్లా 25వ స్థానంతో సరిపెట్టుకుంది. ప్రస్తుతం విద్యా సంవత్సరానికి గాను మార్చిలో జరగనున్న పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 9,290 మంది హాజరుకానున్నారు. గత అనుభవాలు, ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ఈ విద్యాసంవత్సరం నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకెళ్తోంది. మెరుగైన ఫలితాల సాధనతో రాష్ట్రస్థాయి ర్యాంకును మెరుగుపరచుకోవాలనే కృత నిశ్చయంతో ఉంది.



స్వామివారిని దర్శించుకునేందుకు ప్రధానాలయంలో బారులుదీరిన భక్తులు

నృసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి.వేకువజామును సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీ పత్రాలతో అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహహోమం, లోక కల్యాణార్థం స్వామి, అమ్మవార్ల నిత్యకల్యాణం వేడుకగా నిర్వహించారు. అదే విధంగా బ్రహ్మోత్సవం, ప్రధానాలయ మహా ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆయా మాడ వీధుల్లో ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



ఆలయ ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు. అదే విధంగా భక్తులు వ్రతాలు నిర్వహించారు.

క్వింటాళ్ల కొద్దీ దోపిడీ!



ఆలేరులోని కాటన్ మిల్లులో పత్తిలోడ్ వాహనాన్ని, వేబ్రిడ్జిపై తూకం వేస్తూ పక్కన ఏర్పాటు చేసిన బాట్లు

వేబ్రిడ్జి తూకాల్లో మోసాలు

- తరుగు పేరుతో 20నుంచి 50 కిలోల వరకు కోత
- నష్టపోతున్న పత్తి రైతులు
- పర్యవేక్షణ మరిచిన అధికారులు

ఆలేరురూరల్ : పత్తి రైతులు దగా పడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి పండించిన పంటను విక్రయానికి తీసుకురాగా దళారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు కుమ్మక్కై నిలువునా దోచుకుంటున్నారు. తేమ ఎక్కువగా ఉందని, రంగుమారిందని వేబ్రిడ్జి తూకాల్లో తక్కువ చూపించి మోసగిస్తున్నారు.అధికారులు పర్యవేక్షణ మరవడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. ఇందుకు ఆలేరు పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో జరుగుతున్న అక్రమాలే నిదర్శనం. ఆలేరు మండల పరిధిలో రెండు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటికి ఆలేరు, శారాజీపేటలోని జిన్నింగ్ మిల్లులను అలాట్ చేశారు. ఇక్కడికి పరిసర గ్రామాల రైతులు రోజూ వేల టన్నుల పత్తిని టాటా ఏసీలు, ట్రాక్టర్లు, డీసీఎంలలో తెస్తున్నారు. తొలుత పత్తి లోడ్‌తో ఉన్న వాహనాలను వే బ్రిడ్జిపై తూకం వేస్తున్నారు. అన్‌లోడ్ చేసిన తర్వాత తిరిగి ఖాళీ వాహనాలను వే బ్రిడ్జిపై తూకం వేస్తున్నారు. లోడ్‌తో వేసిన తూకంలో నుంచి వాహనం బరువు తీసేయాల్సి ఉంటుంది. కానీ, వేబ్రిడ్జిపై అదనంగా 20 కిలోల బాటు పెట్టి ఖాళీ వాహనాన్ని తూకం వేస్తున్నారు. ఈ 20 కిలోలను పత్తి నాణ్యతగా లేదని, రంగు మారిందని తరుగు కింద తీస్తున్నారు. ఈ విధంగా ఒక టాటా ఏసీ, ట్రాక్టర్ నుంచి 20 నుంచి 30 కిల్లో కటింగ్ చేస్తున్నారు. డీసీఎం అయితే 50 నుంచి క్వింటా వరకు కోత విధిస్తున్నారు. ఆలేరులోని కాటన్ మిల్లులో సీజన్ ఇప్పటి వరకు 596 మంది రైతుల వద్ద 14088 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు.

50 కిలోలు కోత విధించారు



మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. సుమారు 25 క్వింటాళ్ల దిగుబడి రాగా టాటా ఏసీ వాహనంలో ఆలేరులోని శ్రీమల్లికార్జున కాటన్ మిల్లుకు తెచ్చాను. వే బ్రిడ్జిపై కాంటా వేశారు. పత్తిని అన్‌లోడ్ చేసిన తర్వాత తిరిగి వాహనాన్ని తూకం వేసే సమయంలో వే బ్రిడ్జిపై 20 కిలోల బాట్లు పెట్టారు. మొత్తం 50 కిలోల వరకు కటింగ్ చేశారు.

– ఎం.రమేష్, రైతు, మోటకొండూర్

మా దృష్టికి రాలేదు

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు సాఫీగా జరుగుతున్నాయి. తేమ శాతం ఎక్కువ వస్తే అందుకు అనుగుణంగా ధర నిర్ణయిస్తారు. ఎక్కువ తరుగుతీయకుండా చూస్తున్నాం. వే బ్రిడ్జిపైన అదనంగా బాట్లు వేస్తున్నారని మా దృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా తరుగు తీస్తే చర్యలు తీసుకుంటాం.

–అనిల్, కాటన్ ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్, ఆలేరు మండలం

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు



భువనగిరిలోని ఖాజీమహల్లా జమాలుల్ బహర్ దర్గా ఉర్సులో భాగంగా రెండో రోజు ఆదివారం నిర్వహించిన పంఖా ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్‌చిస్తీ, సలావుద్దీన్, జలీల్ తదితరులు -భువనగిరి టౌన్

టీయూటీఎఫ్ నుంచి బహిష్కరణ

సూర్యాపేటటౌన్ : సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు కైలాసం, మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు లచ్చుమల్ల వెంకన్న, కార్యవర్గ సభ్యుడు బి.నాగేశ్వర్‌రావు, ప్రాథమిక సభ్యుడు సీహెచ్.వెంకటేశ్వర్‌రావును తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) సంఘం సభ్యత్వం నుంచి సస్పెన్షకు గురయ్యారు. ఈ మేరకు టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.లచ్చిరాం, పి.రఘునందన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిన పత్రికల్లో వచ్చిన వార్తలపై వివరణ కోరగా వారు స్పందించలేదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం కేవలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాత్రమే నిర్వహించాలని పేర్కొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్య సమస్యలే..

- పెరిగిన చలి తీవ్రత
- వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు



భువనగిరి : చలితీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఆదివారం యాదాద్రి జిల్లాలో కనిష్ట 19, గరిష్ట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. రానున్న రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చలికాలంలో వచ్చే వ్యాధులు

- జ్వరం, శరీరంపై దద్దుర్లు రావచ్చు.
- దగ్గు, ముక్కు కారడం, శ్వాస సంబంధిత సమస్యలు, గొంతు నొప్పి, తుమ్ములు వస్తాయి.
- చిన్నారుల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడి నిమోనియా బారిన పడే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్, ప్రోటోజోవన్ల వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడతాయి.
- గాలిద్వారా సూక్ష్మ జీవులు శరీరంలో ప్రవేశించి తెల్ల రక్తకణాలను నిర్వీర్యం చేయడంతో రోగ నిరోధక శక్తి తగ్గుతుంది.
- పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధికి గురై ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- చిన్న పిల్లలకు స్వెటర్లు, చెవులకు టోపీ, కాళ్లు, చేతులకు సాక్సులు, గ్లౌజ్‌లు వేయాలి.
- నెలల వయసు గల చిన్నారులను తల్లి పొత్తిళ్లలో పడుకోబెట్టాలి. ఉదయం ఎండలో ఉంచాలి.
- చిన్నారులతో ఉదయం ప్రయాణాలు చేయొద్దు.
- పిల్లలకు అవసరమైన టీకాలు ఇప్పించాలి.
- రాత్రి వేళల్లో చల్లగాలి రాకుండా ఇంట్లో కిటికీలు తలుపులు మూసి వేసి వెచ్చదనం కోసం వేడినిచ్చే హైవోల్టేజీ బల్బులను వేయాలి.

64 మందికి నో ఎంట్రీ

- ఆలస్యంగా రావడంతో పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి నిరాకరణ
- మొదటి రోజు ప్రశాంతంగా గ్రూప్–3
- 51 శాతం మంది హాజరు

భువనగిరి : జిల్లా కేంద్రం భువనగిరిలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన పేపర్–1 పరీక్షకు 6,043 మందికి గాను 3,098(51.26శాతం) మంది హాజరయ్యారు. 2,945 మంది గైర్హాజరయ్యారు. పేపర్–2కు 6,043 మంది అభ్యర్థులకు 3,094(51.19) మంది పరీక్ష రాశారు. 2,949 మంది గైర్హాజరయ్యారు.

అరగంట ముందే కేంద్రాల గేట్లు మూసివేత

నిర్దేశిత సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రాల గేట్లను మూసివేశారు. నిమిషం నిబంధన అమల్లో ఉండడం వల్ల ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించలేదు. శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల, జాగృతి డిగ్రీ కళాశాల, మదర్ థెరిస్సా స్కూల్, వెన్నెల కళాశాల, వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల, యూనిటీ ఫార్మసీ కళాశాల, దివ్యబాల విద్యాలయంతో పాటు మరికొన్ని కేంద్రాలకు 64 మంది అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు వారికి అనుమతి నిరాకరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన అభ్యర్థి

సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రానికి చెందిన శృతి అనే అభ్యర్థి పరీక్ష రాయడానికి వస్తుండగా అనాజిపురం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు కావడంతో చికిత్స తీసుకుని భువనగిరిలోని వెన్నెల కళాశాలకు వెళ్లే సరికి ఆలస్యమైంది. కారణం చెప్పినా అధికారులు ఆమెను పరీక్ష కేంద్రంలోని అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు.

నేడు పేపర్–3

పేపర్–3 పరీక్ష సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరగనుంది. అభ్యర్థులు నిర్దేశిత సమయానికి అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషలం ఆలస్యమైనా అనుమతి ఉండదని అధికారులు సూచించారు.



భువనగిరిలోని మదర్‌థెరిస్సా హైస్కూల్ సెంటర్ వద్ద నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



వాత్సల్య ఇంజనీరింగ్ కాలేజీలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ హనుమంతరావు



ఆలస్యంగా రావడంతో కేంద్రంలోకి అనుమతి నిరాకరించడంతో వెనుదిరుగుతున్న అభ్యర్థి



పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో వెన్నెల కళాశాల సెంటర్ వద్ద నిల్చున్న అభ్యర్థులు

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు

భువనగిరిలోని వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పేపర్–2 కూడా ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా కృషి ఐటీఐలోని కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వీరారెడ్డి, వెన్నెల కళాశాల సెంటర్‌ను అదనపు కలెక్టర్ గంగాధర్ సందర్శించారు. వీరితో పాటు గ్రూప్–3 పరీక్షల రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బాలాజీ, ఇతర అధికారు లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న మూగజీవాల పట్టివేత



పట్టుబడిన వాహనంలోని ఆవులు

చౌటుప్పల్ రూరల్: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఆవులు, ఎద్దులను చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో గల తలాబ్‌కట్టకు చెందిన మొహమ్మద్ అజాం ఆదివారం కోదాడ సంతలో చిలుకూరు మండలానికి చెందిన గులాం వద్ద 13 ఆవులు, 4 ఎద్దులను కొనుగోలు చేసి ఆటోలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు పట్టుకున్నారు. అజాంపై కేసు నమోదు చేసి, పట్టుబడిన ఆవులు, ఎద్దులను గోశాలకు తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

కొండమల్లేపల్లి: పట్టపగలే ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ ఘటన ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామానికి చెందిన పోలె అంజయ్య మేకలు కొనుగోలు చేసేందుకు ఆదివారం కొండమల్లేపల్లిలో నిర్వహించే సంతకు వచ్చాడు. అంజయ్య తన ద్విచక్ర వాహనాన్ని సంతలో పార్కింగ్ చేసి మేకల కొనుగోలుకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన నర్సింహగౌడ్

భూదాన్‌పోచంపల్లి: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన భూదాన్‌పోచంపల్లి మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు సుర్వి నర్సింహగౌడ్ (58) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నర్సింహగౌడ్ చేయి, నడుము విరిగింది. సమీపంలో ఉన్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా.. వారు వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మద్దిరాల: భార్య మందలించిందని మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామంలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హెడ్‌కానిస్టేబుల్ వీరసోములు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన చెవిటి మల్లయ్య(63) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మల్లయ్య ఇటీవల అనారోగ్యానికి గురైనా మద్యం తాగడం మానకపోవడంతో అతడి భార్య సత్తమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన మల్లయ్య ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సత్తమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సంక్షోభంలో పాడి పరిశ్రమ

- రోజురోజుకూ పెరుగుతున్న నిర్వహణ వ్యయం
- పాడి రైతులకు గిట్టుబాటుకాని ధరలు
- పెరిగిన ఖర్చులతో నష్టాలు తప్పడం లేదని ఆవేదన



పాడి రైతు పెంచుతున్న గేదెలు

కోదాడరూరల్: అమ్మాలంటే అడవి.. కొనాలంటే కొరివి అన్నచందంగా మారింది పాడి రైతుల పరిస్థితి. పాల కేంద్రాల్లో ధరలు పెరగకపోవడం, పశుగ్రాసం, పచ్చి మేత కొరతతో పాటు దాణా ధరలు విపరీతంగా పెరగడంతో పాడి పోషణ వ్యయం పెరిగి పాడి రైతులు నష్టాలపాలవుతున్నారు. పెరుగుతున్న ఖర్చులు భరించలేక పశువులను అమ్ముకుంటున్నారు. పదేళ్ల కిందట వరకు పాడి పరిశ్రమ రైతులకు దాణాతో పాటు పశుగ్రాసం రేట్లు తక్కువగా ఉండటంతో పాటు గ్రామాల్లో బీడు భూములు ఉండటంతో పచ్చి మేతకు ఇబ్బంది లేకుండా ఉండేది. పాల రేటు తక్కువగా ఉన్నప్పటికీ పాల దిగుబడి ఎక్కువగా ఉండడం, నిర్వహణ ఖర్చు అంతగా లేకపోవడంతో లాభాల బాటలో నడిచారు. ఇటీవల కాలంలో పాల ధరలు పెరగకపోవడంతో నిర్వహణ భారం పెరిగిందని రైతులు అంటున్నారు.

పెరగని పాల ధరలు..

గతంలో పాడి పరిశ్రమ నిర్వహణలో లాభాలు ఉక్కువ ఉండటంతో పాడి రైతులు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి మేలైన జాతుల గేదెలను ఎక్కువ రేటుకు కొనుగోలు చేసి తీసుకొచ్చారు. వాటి నిర్వహణ కోసం రైతులు వారికున్న భూముల్లో లక్షలు ఖర్చుచేసి షెడ్‌లు, నీటి వసతి, పచ్చిగడ్డి పెంచడం వంటి ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరు పాలను హోటళ్లు, గృహ అవసరాలకు లీటరు రూ.70 వరకు విక్రయిస్తుండగా.. గ్రామాల్లో ఉన్న పాల కేంద్రాలు, డెయిరీలకు విక్రయింస్తున్న పాడి రైతులు మాత్రం తమకు వారు ఇచ్చే రేటు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం స్థానికంగా రైతుల నుంచి సేకరిస్తున్న పాల ధరలను శాతాన్ని బట్టి లీటరకు రూ.40 నుంచి రూ.45 వరకు చెల్లిస్తున్నారని, ఎక్కువ శాతం ఫ్యాట్ వస్తే మాత్రం రూ.50 వరకు ధర పలుకుతుందని రైతులు అంటున్నారు. కానీ బహిరంగ మార్కెట్‌లో ఇవే పాలను లీటరుకు రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు.

పశుపోషణ భారంగా మారింది



గతంతో పోలిస్తే ప్రస్తుతం పశుపోషణ చాలా భారంగా మారింది. గడ్డి, దాణా ధరలు రెట్టింపయ్యాయి. పాల కేంద్రాల్లో లీటరు పాల ధర రూ.45 నుంచి రూ. 50కు మించడంలేదు. మా దగ్గర పాలను తీసుకెళ్లి కోదాడలో రూ.70 వరకు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. నిర్వహణ ఖర్చులు భరించలేక కొన్ని గేదెలను అమ్మాను.

– కమతం వెంకటయ్య, తమ్మర గ్రామం, కోదాడ మండలం

విపరీతంగా పెరిగిన దాణా ధరలు..

గతంతో పోలిస్తే ప్రస్తుతం పశుగ్రాసం, దాణా ధరలు రెట్టింపు అయ్యాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు ఎక్కువగా కావాల్సిన ఎండు గడ్డి మోపు రూ.70 నుంచి రూ.100 వరకు, తవుడు క్వింటాల్ రూ.3000, మినప పిట్టు రూ.3000, పెసర పిట్టు రూ.4000, కొబ్బరి పిట్టు రూ.5000 వరకు ఉండటంతో పాడి రైతులు పశువులకు దాణాలు కొనలేక ఆర్థికంగా చతికిలపడి నష్టాలపాలవుతున్నారు. కొద్దిమంది రైతులు ఈ పాడిపోషణ ఖర్చులు భరించలేక తక్కువ ధరలకు తమ పశువులను అమ్ముకుంటున్నారు. కొందరు అధిక ధర పెట్టి దాణా, పశుగ్రాసం కొనుగోలు చేసి పాడి పరిశ్రమ నిర్వహిస్తున్నా.. పాల కేంద్రాలు, డెయిరీ యాజమాన్యాలు ధరలను పెంచకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంటున్నారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, అధికారులు సబ్సిడీపై రుణాలు, దాణా అందించేలా చూడాలని పాడి రైతులు కోరుతున్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం



పురుగు మందు డబ్బాతో విజయ

ఆత్మకూర్(ఎస్): భూమి పంచాయితీ, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించి బంధువుల వేధింపులు తాళలేక మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్‌తండాలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోటినాయక్‌తండాకు చెందిన ధరావత్ హుస్సేన్, విజయ భార్యాభర్తలు. హుస్సేన్ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. హుస్సేన్ బాబాయి ధరావత్ మంగ్య, ఆయన భార్య, మాజీ సర్పంచ్ మంగమ్మతో పాటు మరికొంత మంది భూమి పంచాయితీ, కేబుల్ లెక్కలకు సంబంధించి వేధిస్తున్నారంటూ హుస్సేన్ భార్య విజయ ఆదివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగింది. తనను వేధిస్తున్న విషయాన్ని విజయ తన సెల్‌ఫోన్‌లో వీడియో రికార్డ్ చేసింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. హుస్సేన్ ఫిర్యాదు మేరకు పోలీసులు జడ్జి సమక్షంలో బాధితురాలు విజయ వాంగ్మూలం తీసుకున్నారు. ధరావత్ మంగ్య, మంగమ్మతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లింగయ్య తెలిపారు.

మద్యం మత్తులో యువకుడిపై దాడి

- నిందితుల రిమాండ్

గుర్రంపోడు: ఇద్దరు యువకులు మద్యం మత్తులో మరో యువకుడిపై దాడి చేశారు. ఈ ఘటన గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పోలు గ్రామంలోని బస్టాండ్ వద్ద శనివారం రాత్రి మద్యం మత్తులో ఈర్ల నరేష్, కొత్త సాయి అనే ఆకతాయిలు బాషిపాక నరేష్‌ను బీరు బాటిల్‌తో పొడిచి గాయపర్చారు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మధు తెలిపారు.

మార్కెట్ ఉన్నా.. ధాన్యం కొనుగోళ్లు సున్నా!



పైన ఫొటోలో ఉన్నది కోదాడ వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన షెడ్లు. చాలా ఏళ్లుగా ఇక్కడ ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో షెడ్లు శిథిలావస్థకు చేరాయి. ఈ మార్కెట్ ఆవరణలోనే ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. కొంత మంది వ్యాపారులు తమ పశువులను ఆదివారం నుంచి మళ్లీ ఆదివారం వరకు ఆ షెడ్లలోనే ఉంచుతున్నారు. ఈ మార్కెట్ ఆవరణను రోజూ ఎనిమిది మంది సిబ్బందితో శుభ్రం చేయిస్తూ నెలకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మార్కెట్‌లో ఎలాంటి కార్యక్రమాలు జరగకపోయిన మార్కెట్ సెస్‌రూపంలో ఏటా ఐదారు కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా, వాటిని పప్పు బెల్లంలా ఖర్చు చేస్తున్నా రైతుల కోసం నయాపైసా ఖర్చు చేయడం లేదనే విమర్శలున్నాయి.

- ఉత్సవ విగ్రహంలా కోదాడ వ్యవసాయ మార్కెట్
- ఏళ్లుగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయట్లే..
- రైతుల విజ్ఞప్తులు బుట్టదాఖలు
- అన్ని సౌకర్యాలున్నా పట్టించుకోని యంత్రాంగం



కోదాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

కోదాడ: రైతు ప్రయోజనాల కోసం కోదాడ పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ ఉత్సవ విగ్రహంలా మారింది. సెస్ రూపంలో కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా రైతులకు నయా పైసా ఉపయోగపడడం లేదు. విశాలమైన ఆవరణ, గోదాములు, ఉద్యోగులు అన్నీ ఉన్నా రైతుల నుంచి గింజ ధాన్యం కొనడం లేదు. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు దమ్మిడి పనిలేక రోజు వచ్చి ఇక్కడ భోజనం చేసి వెళుతుంటారని పలువురు రైతులు అంటున్నారు. రెండేళ్లుగా ఈ మార్కెట్‌కు పాలకవర్గం కూడా లేక పోవడంతో అన్నదాతలకు ఎందుకూ ఉపయోగపడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయట్లే..!

అన్ని సౌకర్యాలున్న కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు చేయడానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వర్షం వచ్చినా ధాన్యం తడవకుండా షెడ్లు ఉన్నందున ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదు. కేవలం ఆదివారం జరిగే పశువుల సంతగా ఇది మారిపోయింది. ఈ సంతలో కూడా అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఆరోపణలున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విస్మయాన్ని కలిగిస్తున్న అధికారుల తీరు

కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో కార్యాలయం కోసం రెండస్తుల భవనం నిర్మించారు. పైఅంతస్తులో సమావేశ మందిరం, కింది అంతస్తులో కార్యదర్శి, ఇతర సిబ్బందికి గదులు కేటాయించారు. ఇదే ఆవరణలో అతిథిగృహం కూడా ఉంది. రెండేళ్ల క్రితం దీన్ని ఆధునీకరించారు. తమ కార్యాలయం కురుస్తున్నదని ఇటీవల అధికారులు దాన్ని అన్ని సౌకర్యాలున్న అతిథిగృహంలోకి మార్చుకున్నారు. రెండు అంతస్తులున్న కార్యాలయంలో పైఅంతస్తు బాగానే ఉన్న కింది అంతస్తు కురుస్తుందని అధికారులు చెప్పడం విస్మయాన్ని కలిగిస్తోందని పలువురు రైతులు అంటున్నారు. తమకు అన్ని సౌకర్యాలుండేలా చూసుకుంటున్న అధికారులు మార్కెట్ లోపల మంచినీటి వసతి, మరుగుదొడ్లు లేకున్నా పట్టించుకోవడంలేదు.

ఎన్ఎంఎంఎస్.. విద్యార్థులకు వరం

- 24వ తేదీన రాత పరీక్ష
- పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు



చిలుకూరు జెడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

చిలుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నేషనల్ మీన్స్ కం మెరిట్(ఎన్ఎంఎంఎస్) టెస్ట్ నిర్వహిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి ఈ నెల 24వ తేదీన పరీక్ష జరగనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇదొక సదవకాశం. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం నేరుగా విద్యార్థి బ్యాంక్ ఖాతాలో జమవుతాయి. ప్రభుత్వ, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రెండు వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

180 మార్కులకు పరీక్ష..

ఎన్ఎంఎంఎస్ పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుంది. మొదటి విభాగంలో మెంటల్ ఎబిలిటీకి సంబంధించి 90 మార్కులతో ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ తదితర ప్రశ్నలు ఈ విభాగంలో ఉంటాయి. రెండో విభాగంలో ఆప్టిట్యూడ్‌కు సంబంధించి గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల నుంచి 90 మార్కులతో ప్రశ్నలు ఉంటాయి. 7వ తరగతి సిలబస్‌తో పాటు 8వ తరగతి సగం సిలబస్ ఉంటుంది.

విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం



ఎస్ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. సెలవు రోజుల్లో సైతం ప్రత్యేక క్లాసులు తీసుకొని శిక్షణ ఇస్తున్నాం. ప్రతి ఏడాది చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 5 నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికవుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు, తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నాం.

– నాగుబంటి రామారావు, ఉపాధ్యాయుడు, చిలుకూరు జెడ్పీహెచ్ఎస్

కోళ్ల ఫాంలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్



చింతపల్లి శివారులోని కోళ్ల ఫాంలో తవ్విన బావి

- భయాందోళనలో చుట్టుపక్కల రైతులు
- పోలీసులకు ఫిర్యాదు
- బ్లాస్టింగ్ చేసే వాహనం స్వాధీనం

చింతపల్లి: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఓ కోళ్లఫాంలో ఎలాంటి అనుమతులు లేకుండా నెల రోజుల నుంచి భారీ పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చేస్తూ పెద్ద బావి తవ్వుతున్నారు. దీంతో సమీప పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఇదే విషయమై రైతులు పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ఆదివారం ఎస్ఐ యాదయ్యకు విషయం తెలియజేశారు. దీంతో ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని బ్లాస్టింగ్ చేసే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకున్న కోళ్లఫాం నిర్వాహకులు బ్లాస్టింగ్‌కు సంబంధించిన పదార్థాలను భద్రపరిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. కోళ్ల ఫాంలో ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వాహనాలను పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గౌని యాదగిరి(59) శనివారం బైక్‌పై మిర్యాలగూడ పట్టణానికి బయల్దేరాడు. మార్గమధ్యలో అద్దంకి -నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డులోని కిష్టపురం (గడ్డబావి) వద్ద గల మణిశివ వాటర్ ప్లాంట్ సమీపంలో అదుపుతప్పి కిందపడిపోవడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని అంబులెన్స్‌లో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుమారుడు గౌని జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో..



శివశంకర్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆస్పత్రిలో చేరిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు బడుగు రమేశ్ కుమారుడు బడుగు శివశంకర్(30) పతంజలి మెడికల్ స్టోర్ నిర్వహిస్తూ, మగ్గం పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతున్న శివశంకర్ స్థానికంగా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా తగ్గలేదు. ఈ నెల 13వ తేదీన జ్వరం వలన ఫిట్స్ వచ్చి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు.

• మొదటిరోజు ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష



నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీలో పరీక్ష రాయడానికి క్యూలో వెళ్తున్న అభ్యర్థులు



నల్లగొండ పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కళాశాల వద్ద హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న పోలీసులు



భువనగిరి పట్టణంలోని దివ్యబాల విద్యాలయం సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు



సూర్యాపేటలోని ప్రతిభ జూనియర్ కళాశాల సెంటర్‌కు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను గేటు బయటే ఆపివేసిన పరీక్షా కేంద్రం సిబ్బంది



నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ కళాశాల సెంటర్‌కు ఆలస్యంగా వచ్చి పరుగు తీస్తున్న అభ్యర్థి



సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్ వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



భువనగిరి: పరీక్ష రాసేందుకు వెళ్తున్న భార్యకు సూచనలు ఇస్తున్న భర్త



సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌కు వచ్చిన దివ్యాంగురాలిని పోలీస్ వాహనంలో పరీక్ష రూం దగ్గరికి తీసుకెళ్తున్న తుంగతుర్తి సీఐ డి. శ్రీను



భువనగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడి పరీక్ష కేంద్రానికి వచ్చిన అభ్యర్థిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న బంధువులు

భువనగిరి: వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల వద్ద సెల్ ఫోన్‌లో హాల్‌టికెట్ ఉందని సిబ్బందికి చూపిస్తున్న మహిళా అభ్యర్థి





భువనగిరి మండలం అనంతగిరి పరిధిలోని వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌కు ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించకపోవడంతో గేటు ముందు నిల్చున్న అభ్యర్థులు